బల్దియా ఖజానా ఖాళీ

- కాంట్రాక్టర్ చెక్కు బౌన్స్
- తలకిందులుగా వేసిన రబ్బర్ స్టాంప్ ముద్ర

చెక్కుపై తలకిందులుగా వేసిన ముద్ర, స్టాంప్ సరిగా లేదని, డబ్బులు లేవని రాసిన అధికారులు

వరంగల్, జూన్ 19: బల్దియా ఖజానా ఖాళీ అయ్యింది. కార్పొరేషన్ అకౌంట్ సెక్షన్ నుంచి వెళ్లిన చెక్కు బౌన్స్ అయ్యింది. తమ ఈఎండీకి సంబంధించిన డబ్బులకు చెక్కును కాంట్రాక్టర్‌కు కార్పొరేషన్ అకౌంట్స్ అధికారులు ఇచ్చారు. బుధవారం రూ.23,400ల చెక్కును బ్యాంక్‌లో వేయగా అకౌంట్స్‌లో డబ్బులు లేవని అధికారులు చెప్పడంతో కాంట్రాక్టర్ ఖంగుతిన్నాడు. కేవలం రూ. 23,400లు కార్పొరేషన్ జనరల్ ఫండ్ ఖాతాలో లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. 'ఇన్‌సఫీషియంట్ అమౌంట్' అంటూ బ్యాంక్ అధికారులు చెక్కు వెనుక రాసి కాంట్రాక్టర్ చేతిలో పెట్టారు. 20 రోజులుగా పన్నుల వసూళ్లు నిలిచిపోవడంతో బల్దియా ఖజానా ఖాళీ అయినట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ సుమారు రూ. 50 లక్షల వరకు పన్నులు వసూళ్లు అవుతుంటాయి. అయితే సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ ప్రోగ్రాం మార్చడం, దానిని అప్‌డేట్ చేయకపోవడంతో గ్రేటర్ కార్పొరేషన్‌లో 20 రోజులుగా పన్నుల వసూళ్లు నిలిచిపోవడం వల్ల ఖజానా ఖాళీ అయినట్లు తెలుస్తోంది.

ఎగ్జామినర్ అకౌంట్స్ నిర్లక్ష్యం

ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్ సెక్షన్‌లో అంతా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన చెక్కుపై తలకిందులుగా వేసిన రబ్బర్ స్టాంప్ ముద్ర ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన సీటులో ఉన్న ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అధికారి నిర్లక్ష్యంగా తన స్టాంప్‌ను తలకిందులుగా వేసి సంతకం చేయడం అతని నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రబ్బర్ స్టాంప్ తలకిందులు వేసి సంతకం చేయడంపై బ్యాంక్ అధికారులు తప్పుపట్టారు. చెక్కు వెనుక స్టాంప్ సరిగా లేదని స్పష్టంగా రాశారు. అదే చెక్కుపై కమిషనర్ సంతకం చేయడం గమనార్హం.

పారిశుధ్యంలో ఆధునిక పద్ధతులు

- నగరాభివృద్ధికి కృషి చేస్తున్నాం
- మాల్దీవ్స్ బృందానికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- ప్రతినిధులను సన్మానించిన మేయర్, కమిషనర్

మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులతో సమావేశంలో నగర అభివృద్ధిని వివరిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, జూన్ 19: పారిశుధ్యంలో కొత్త పద్ధతులు అవలంబిస్తున్నామని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యుల బృందంతో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సమావేశమయ్యారు. నగరాభివృద్ధికి చేస్తున్న కృషి, స్మార్ట్‌సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు, స్వయంసహాయక సంఘాలకు అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మృందం సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లు, పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా బల్దియా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటుందని అన్నారు. నగరంలో పచ్చదనం కోసం పార్కులు, రోడ్డు వెంబడి మొక్కలు నాటుతున్నామని అన్నారు. ఏటా బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తామని, స్మార్ట్‌సిగా పథకంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని ఆమె వివరించారు. రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరంగా వరంగల్ ఉందని, అన్ని వ్యవస్థ లను ఓకే చోట నుంచి కంట్రోల్ చేయడానికి కార్పొరేషన్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులను మేయర్, కమిషనర్ సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

క్షేత్రస్థాయి పర్యటన

నగరంలో జరుగుతున్న అభివృదికధ పనులతో పాటు పారిశుధ్య వ్యవస్థలో అవలంబిస్తున్న కొత్త పద్ధతులపై అధ్యయనం చేసేందుకు నగరానికి విచ్చేసిన మాల్దీవ్స్ కౌన్సిల్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. రాంపూర్‌లోని డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన కౌన్సిల్ బృందం అక్కడ చెత్త శుద్ధీకరణకు అమలు చేస్తున్న బయో మైనింగ్ పద్ధతులను పరిశీలించారు. ప్రగతి నగర్‌లోని మురుగునీటి శుద్ధీకరణ చేసే ప్లాంట్‌ను పరిశీలించారు. మాల్దీవ్స్ దేశంలో కొత్త పద్ధతులను అవలంబించేందు కు సహకారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, పీఆర్‌వో ఆయూబ్ అలీ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, డీసీపీ ప్రకాశ్ రెడ్డి, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, స్మార్ట్‌సిటీ ప్రతినిధి ఆనంద్ వోలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు బల్దియా బడ్జెట్ సమావేశం

వరంగల్, జూన్ 19 : గ్రేటర్ కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించనున్నారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11.30 గంటలకు బడ్జెట్ సమావేశం ప్రారంభం కానుంది. సమావేశంలో బడ్జెట్ అంచనాలపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చిలో జరగాల్సిన బడ్జెట్ సమావేశం జూన్‌లో జరుగుతుంది. బల్దియా అధికారులు ఈ మూడు నెలల కోసం కలెక్టర్‌తో బడ్జెట్‌కు ఆమోదం తీసుకున్నారు.

రికార్డులు సిద్ధం చేయాలి

పరకాల, జూన్ 19: కేంద్రప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి అధికారుల పర్యటన నేపథ్యంలో ఉపాధి హామీ పనులు, రికార్డులను ఈజీఎస్ సిబ్బంది సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యా లయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వారం నుంచి ఎంవో ఆర్డీ టీం తనిఖీలు నిర్వహిస్తుందని, గ్రామాల్లో చేపట్టిన పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు పనులకు సంబంధించి ఏడు రిజిస్టర్‌లను గ్రామ పంచా యతీలో అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఏపీవో ఇందిర, టీఏలు సుమలత, నాగరాజు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రైల్వే సీనియర్ డీఈఎస్ రామారావు

కాజీపేట, జూన్ 19: రైల్వే సేఫ్టీ విభాగాల్లో విధులు నిర్వర్తించే ప్రతి కార్మికుడు అప్రమ త్తంగా ఉండాలని రైల్వే సీనియర్ డీఈఎస్(కో ఆర్డినేషన్) రామారావు అన్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌లో రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ట్రాక్‌మెన్‌లకు సేఫ్టీ సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని, యూనిట్‌లో తప్పకుండా రెస్ట్ రూంను ఏర్పాటు చేయాలని, కీ మెన్‌లపై పని భారం తగ్గించాలని, తదితర సమస్యలనుట్రాక్‌మెన్‌లు వివరించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రామారావు హామీ ఇచ్చారు. దక్షిణమధ్య రైల్వే జోనల్ అధ్యక్షుడు కాలువ శ్రీనివాస్, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ సెక్రటరీ, అధ్యక్షుడు పిల్లలమర్రి రవీందర్, ఖాజాబాబా, ఏడీఎస్ చిలుక స్వామి, నర్సింహారెడ్డి, కన్వీనర్ సదానందం, రాజేందర్, అంజియాదవ్, యాగేందర్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

హసన్‌పర్తి, జూన్ 19: మండలంలోని అర్వపల్లి, హరిశ్చంద్రనాయక్ తండా పాఠశాలను కలెక్టర్ ప్రావీణ్య బుధవారం అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఇస్తున్న ఆహారంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వేదవతి, డీఈవో అబ్దుల్ హై, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం'

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: హనుమకొండ ఎల్ఐసీ కూరగాయల మార్కెట్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై 'పర్యావరణ నేషనల్ నెట్వర్క్' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ఉచిత బట్ట సంచుల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ డైరెక్టర్ మిద్దెల బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బదులు బట్ట, ఇతర గోన సంచులు వాడాలని సూచించారు. పర్యావరణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా 500సంచులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, మార్కెటింగ్ డైరెక్టర్లు రావుల సుదర్శన్, బాధ్యులు రాజమౌళి, స్వామి, కృష్ణ, పర్యావరణ సంస్థ బాధ్యులు కుమారస్వామి, సుధాకర్, కాళీదాస్, విజయరావు పాల్గొన్నారు.

రేపు యోగా వేడుకలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: ఈనెల 21న వరంగల్‌లోని సీకేఎం కాలేజీ గ్రౌండ్‌లో త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ప్రెసిడెంట్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగి న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా 10 వేల మంది విద్యార్థులు, భక్తులతో నిర్వహించే మెగా యోగా క్యాంపులో నగర వాసులకు చిన్నజీయర్‌స్వామితో కలిసి చేయడం వారికి సువర్ణావకాశమన్నారు. మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మురళీధర్, తిరుమల్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో బాలుడి మృతి

కమలాపూర్, జూన్ 19: మండలంలోని శనిగరం-మాదన్నపేట గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపనవేని సిద్ధు(17) మృతి చెందగా, బైరేని ప్రదీప్, విశ్వతేజ, మారు తిలకు తీవ్రగాయాలైనట్లు సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. శనిగరం గ్రామానికి చెందిన సిద్ధు, మాదన్నపేటకు చెందిన ప్రదీప్, విశ్వతేజ, మారుతి ద్విచక్ర వాహనంపై రాత్రి మాదన్నపేట నుంచి బయలు దేరారు. ఓవర్ స్పీడ్‌తో బైక్‌పై నలుగురు ప్రయాణిస్తూ గ్రామశివారులో చెట్టుకు ఢీ కొట్టారు. దీంతో వెనుకాల కూర్చున్న సిద్ధు అక్కడిక్కడే మృతి చెందగా ప్రదీప్, విశ్వతేజ, మారుతిలకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రదీప్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

'కార్మికుల హక్కుల కోసం పోరాటం'

కాజీపేట, జూన్ 19: అన్ని రంగాల కార్మికులను ఐక్య వేదికగా ఏర్పాటు చేసి రాబోయే కాలంలో వారి హక్కుల కోసం సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి అన్నారు. కాజీపేట పట్టణం ఫాతిమానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం మండల ముఖ్య నాయకుల సమావేశం కారు ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. చక్రపాణి ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ చట్టాలను సవరించి యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా చేసిందన్నారు. ఆ చట్టాలు అమలైతే కార్మికులు కేవలం యాజమాన్యంపై ఆధారపడి బతికే పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం కాజీపేట మం డల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కారు ఉపేందర్, కో-కన్వీనర్‌గా రామంచ సారంగపాణి, ఎండీ యా కూ బీ, సభ్యులుగా ఓరుగంటి సాంబయ్య, మంద సువర్ణ, మంద చిన్న, నరేశ్, లక్ష్మణ్, రామస్వా మి, కోమల, స్వరూప, రాజేశ్వరి, సరిత, మ హేశ్వరి, లక్ష్మీ, పర్వీనా, సంధ్య ను ఎన్నుకున్నారు. సీఐటీయూ మాజీ నాయకులు చుక్క య్య, ఓరుగంటి సాంబయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

న్యూశాయంపేట, జూన్ 19: హంటర్ రోడ్డులోని ఏకశిల వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 32వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంచనగిరి రాజ్‌కుమార్ వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. బూత్ అధ్యక్షుడు చెన్నూరి రంజిత్, సామ ల భాను, బుదారపు సంజయ్, కార్తీక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: కేయూ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో సంవత్సరం పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీలో ఇద్దరు మాల్‌ప్రాక్టీసింగ్ చేస్తూ పట్టుబడగా వారిని డిబార్ చేసినట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే పోరుబాటే

ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ

మాట్లాడుతున్న శ్రీనివాస్, లక్ష్మారెడ్డి

శాయంపేట, జూన్ 19: గ్రామాల అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే పోరుబాట తప్పదని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, కొప్పుల ఎంపీ టీసీ మేకల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి అన్నారు. శాయంపేటలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే డబ్బులు రాక వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా ఎన్నికల కోడ్ పేరుతో ఇప్పటివరకు బిల్లుల చెల్లింపు జరగడం లేదని అన్నారు. అధికారులను అడిగితే ఎన్జీవోలో నిధులు జమయ్యాకే బిల్లులు వస్తాయని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించ కుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీవోను అడిగితే ప్రభుత్వం ఏ రోజు డబ్బులు వేస్తే ఆరోజే అందుతాయని, రానిదిమేం ఏం చేస్తామని అంటున్నారన్నారు. బిల్లులు ఇవ్వకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా: డీఎం

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: డీలక్స్ బస్సుల్లో జూన్ 16 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ప్రయాణించే మహిళలకు ప్రతి 15 రోజులకు ఒక లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు డీఎం వంగల మోహన్‌రావు తెలిపారు. వీరు తమ టికెట్‌పై పేరు, అడ్రస్, సెల్ నంబర్ రాసి డ్రైవర్ సీటు వెనక ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని కోరారు. ఒకటో తేదీన డ్రా తీసి అందులో వచ్చిన ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే 1 నుంచి 15వ తేదీ వరకు ప్రయాణించే మహిళా ప్రయాణికులకు 16వ తేదీన డ్రా తీసి ముగ్గురికి బహుమతులు ఇస్తామన్నారు. డీలక్స్ బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణించి ప్రతి 15 రోజులకొకసారి తీసే లక్కీ డ్రాలో పాల్గొనాలని కోరారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పేదింటి కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర, జూన్ 19: పేదింటి యువతుల కల్యాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద ఆర్థికంగా చేయూ తనిచ్చి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలోని సమా వేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన 84 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.84లక్షల 9744ల చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, ఎంపీటీసీలు కృపాకర్‌రెడ్డి, శనిగరం కళాసుధాకర్, రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, నాయకులు జంగిలి వేణు, దురిశెట్టి భిక్షపతి, బిల్లా రమణారెడ్డి, సదిరం పోశయ్య, తహసీల్దార్ జ్యోతివర లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు చేయాలి

ఎమ్మెల్యే నాయినికి మున్సిపల్ కార్మికుల వినతిపత్రం

నయీంనగర్, జూన్19: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌కు వినతిపత్రం అందజే సినట్లు సీఐటీయూ అధ్యక్షుడు ఉప్పలయ్య తెలిపారు. సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, హనుమకొండ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ. 10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, నేడు జరుగబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించాలని వారు కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీవోస్ నేతలు

హనుమకొండ చౌరస్తా : పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని వచ్చిన సందర్భంగా ఆయనను క్యాంపు కార్యాలయంలో హనుమకొండ జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కార్యదర్శి బైరి సో మయ్య, కేంద్ర సంఘం నేతలు శ్యామ్‌సుందర్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేత లు కత్తి రమేశ్, రాజేశ్‌ఖన్నా, రాజీవ్, అనూప్, ప్రణయ్, పృథ్వి, శివ పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: పాలిటెక్నిక్ డిప్లామా కోర్సుల్లో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 20 నుంచి ప్రారంభమవు తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. పాలిసెట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు 24 వరకు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ స్లాట్స్ ఎంచుకోవచ్చని, 22 నుంచి 25 వరకు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికె ట్లను పరిశీలిస్తారన్నారు. విద్యార్థులు తాము కోరుకున్న కోర్సులను ఎంచుకొని tgpolycet.nic.in website ద్వారా ఆప్షన్స్‌ను 22 నుంచి 27 వరకు ఇచ్చుకోవచ్చని, 30న సీటు కేటాయిస్తారన్నారు. సీటు పొందిన విద్యార్థులు 30 నుంచి జూలై 4 వరకు వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ రుసుం చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థు లు తమ తల్లిదండ్రుల మొబైల్ నంబర్‌ను మాత్రమే సర్టిఫికెట్స్ ధ్రువీకరణ సమయంలో నమోదు చేయాల్సి ఉంటుందని, ఆ నంబర్‌కే లాగిన్ ఐడీ పంపుతారని పేర్కొన్నారు. వీలైనన్ని ఎక్కువ ఆప్షన్స్ ఇవ్వాలని, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇతరులకు ఇవ్వకూడదన్నా రు.

ఆర్టీసీ ఆర్ఎంగా విజయభాను బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న విజయభాను

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డీ విజయభాను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్)గా పనిచేస్తున్న విజయభాను ఉద్యోగోన్నతిపై వరంగల్ రీజియన్ మేనేజర్‌గా వచ్చారు. 2022 నవంబర్ 18 నుంచి వరంగల్ రీజినల్ మేనేజర్‌గా ఇక్కడ పనిచేసిన జాస్తి శ్రీలత బదిలీపై రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా వెళ్లారు. విజయభానుకు ఉద్యోగులు, యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల తరపున పోరాడాలి

కార్పొరేటర్లతో సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: ప్రజల తరపున పోరాడాలని కార్పొరేటర్లకు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నేటి బల్దియా సమావేశంలో స్థానిక సమస్యలపై చర్చించాలని, వరదలు, తాగునీటి సరఫరా సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా వినయ్‌భాస్కర్ సూ చించారు. నగరాభివృద్ధికి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తయ్యేలా ఒత్తిడి తేవాలన్నారు. డివిజన్లలో అత్యవసర పనులకు నిధులు కేటాయించేలా డిమాండ్ చేయాలని, బడ్జెట్ కూర్పుపై విస్తృతంగా చర్చించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్లి రవి, ఇంద్ల నాగేశ్వరరావు, బస్వరాజు శిరీష, రాజు, అశోక్‌యాదవ్, మనీషా శివకుమార్, బాబు, మనోహర్, సువర్ణ సురేశ్, దివ్యరాణి రాజునాయక్, రవినాయక్, మధుసూదన్, కిరణ్, నర్సింగరావు, కుమారస్వామి, రాజు, రాధికారెడ్డి, సుధాకర్‌రెడ్డి స్వరూపారాణిరెడ్డి, పద్మ, రంజిత్‌రావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం స్కీంలను సక్రమంగా అమలు చేయాలి

క్షేత్రస్థాయిలో పరిశీలించిన కేంద్ర బృందం

ఎన్‌హెచ్ఎం సేవలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వరంగల్, జూన్ 19 : జాతీయ ఆరోగ్య మిషన్ స్కీం ద్వారా అమలు అవుతున్న పథకాలను సక్రమంగా ఆమలు చేయాలని కేంద్ర బృందం అధికారులు జిల్లా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. పోచమ్మకుంట పీహెచ్‌సీ, దర్గా కాజీపేట బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ సెంటర్, ప్రసూతి ఆసుపత్రిలలో పర్యటించారు. అందిస్తున్న వైద్యసేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హనుమకొండ ప్రసూతి ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం, మిల్క్ బ్యాంక్, టీ డయాగ్నస్టిక్ హబ్, బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ వరుణ్ విజయ్ గైకి, డాక్టర్ తేజ్ కిరణ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సరళాదేవీ, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్‌రావు, ఆర్ఎంవో డాక్టర్ సారంగం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

అతిథి మనో